# నేతన్నల జీవితాల్లో వెలుగులు

## స్వరాష్ట్రంలో మారిన బతుకు చిత్రం

**వివిధ సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్న బీఆర్ఎస్ సర్కారు**

**సామాజిక భద్రత కోసం నేతన్నకు చేయూత పథకం**

**రైతుబంధు మాదిరి నేతన్న బీమా స్కీమ్**

**కార్మికుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతినెలా రూ. 3 వేలు జమ**

**కొత్తగా చేనేత మగ్గం పథకం అమలు**

**మళ్లీ అధికారంలోకి రాగానే మరిన్ని కార్యక్రమాల అమలుకు హామీ**

సమైక్య రాష్ట్రంలో దెబ్బతిన్న నేతన్నలకు స్వరాష్ట్రంలో మంచి రోజులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం నేతన్నలకు అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నది. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదెరువుగా నిలుస్తున్నది. గతంలో పని కోసం వలస పోయిన నేతన్నలు ఇప్పుడు సొంతూర్లలోనే పని దొరకడంతో సంతోషంగా బతుకుతున్నారు.

– యాదాద్రి భువనగిరి (నమస్తే తెలంగాణ)/ భూదాన్ పోచంపల్లి, నవంబర్ 7



### నేతన్నల ఖాతాల్లో నెలకు రూ.3వేలు

డిజిటల్ సర్వే ప్రకారం జిల్లాలో పనిచేస్తున్న చేనేత మగ్గాలు 6,651, మర మగ్గాలు 2,165, నేత వృత్తిపై జీవనోపాధి పొందుతున్న కళాకారుల మగ్గాలకు జియో ట్యాగ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికుల కోసం సబ్సిడీ చేనేత మిత్ర పథకాన్ని అమలు చేసింది. దీని కింద నేత కార్మికులకు రసాయనాలు, నూలుపై 40శాతం రాయితీ కల్పించింది. అయితే కొందరికి అవగాహన లేకపోవడం, సబ్సిడీ పొందే ప్రక్రియ తెలియకపోవడంతో రాయితీ పొందలేకపోతున్నారు. ఇకపై మగ్గం మీద పనిచేసే ప్రతి కార్మికుడికీ నెలనెలా రూ.3వేల ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించింది. నేత కార్మికుల బ్యాంక్ ఖాతాల్లో ఈ డబ్బు జమ చేస్తున్నది. ఇందులో నేత కార్మికుడికి రూ.2వేలు, అనుబంధ కార్మికులకు వెయ్యి ఖాతాల్లో వేస్తున్నది. ఇప్పటికే నేతన్నలకు డబ్బులు చేరుతున్నాయి. జిల్లాలో మొత్తంగా 10,600 మందికి లబ్ధి చేకూరుతున్నది.

### నేతన్నకు చేయూత

నేతన్నలకు సామాజిక భద్రత కల్పించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికుల నెలసరి చేనేత ఆదాయంలో ఎనిమిది శాతం ఆర్డీ1లో జమ చేసిన తర్వాత.. ఆర్డీ2లో 15శాతాన్ని నేరుగా జమ చేస్తున్నది. ఆ మొత్తం నగదును వడ్డీతో సహా మూడేండ్ల తర్వాత కార్మికులకు అందిస్తున్నది. ఈ పథకం కింద జిల్లాలో 2017–20 సంవత్సరంలో 5,312 మంది నేతన్నలకు రూ.37.26 కోట్లను ప్రభుత్వం తమ వాటాగా విడుదల చేసింది. ప్రస్తుత 2021–2024 సంవత్సరానికి గాను 6,241 మంది కార్మికులు నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.32.38 కోట్లు విడుదల చేసింది.

### నేతన్న బీమా పథకం

నేత కార్మికుల కోసం రైతు బీమా తరహాలో చేనేత బీమా పథకాన్ని 2022 ఆగస్టు 7న రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. దీనికి 18 నుంచి 59 ఏండ్లలోపు నేతన్నలు అర్హులు. జిల్లాలో 9,734 మంది చేనేత కార్మికులు, 943 మంది మరమగ్గాల నేత కార్మికులు నమోదు చేసుకున్నారు. జిల్లాలో ప్రాణాలు కోల్పోయిన 24 మంది కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున పరిహారం అందింది. ఇప్పటి వరకు జిల్లాలో రూ.1.20కోట్ల సాయం అందింది.

### నేత కార్మికులకు రూ.2వేల పింఛన్

చేనేత కార్మికులను ఆదుకునేందుకు సర్కారు మరో గొప్ప పథకానికి నాంది పలికింది. నేతన్నల మనుసు తెలిసిన సీఎం కేసీఆర్ వారికి రూ.2వేల పెన్షన్ ఇస్తున్నారు. వృద్ధాప్య పింఛన్‌కు అర్హత 57సంవత్సరాల వయస్సు కాగా.. నేత కార్మికులకు మాత్రం 50ఏండ్లకే పింఛన్ అందజేస్తున్నారు. దీంతో వేల మంది నేతలన్నలకు ఎంతో భరోసా లభిస్తున్నది. బక్కచిక్కిపోయిన వారికి ఆసరా అవుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో నేత కార్మికులకు ఎలాంటి పింఛన్ లేదు.

### చేనేత మగ్గం పథకం

రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికుల కోసం తెలంగాణ చేనేత మగ్గం పథకానికి ఇటీవల శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద నేతన్నలకు గుంట మగ్గాల స్థానంలో ఫ్రేమ్ మగ్గాలను పంపిణీ చేస్తున్నది. దీని వల్ల అనారోగ్య సమస్యలు దూరం కానున్నాయి. అంతేకాకుండా శ్రమ తగ్గి నాణ్యమైన చేనేత వస్త్రాల ఉత్పాదకత పెరుగుతుంది. ఇక చేనేత రుణ మాఫీ, నేత కార్మికులకు పింఛన్, బ్లాక్ లెవల్ క్లస్టర్ల ఏర్పాటు తదితర కార్యక్రమాలను చేపట్టింది. దీంతో రాష్ట్రంలో నేత కార్మికుల బతుకులు మారాయి. మరోవైపు చేనేత కార్మికులతోపాటు అనుబంధ కార్మికులకు కంటి, ఎముకలు, మధుమేహం, అధిక రక్తపోటు తదితర వ్యాధులకు ఆరోగ్య కార్డు ద్వారా చికిత్స అందించేందుకు సర్కారు ముందుకొచ్చింది. ప్రతి కుటుంబానికి ఏటా రూ.25వేల వరకు వైద్య సదుపాయం కల్పించనుంది. ఈ స్కీమ్‌ను మరో సారి అధికారంలోకి రాగానే అమలు చేయనుంది.



### ఫ్రేమ్ మగ్గాలు ఇస్తామనడం సంతోషకరం



సాంప్రదాయంగా వస్తున్న గుంట మగ్గాలపై ఆధారపడి వస్త్రం నేస్తున్నాం. 40 ఏండ్లుగా గుంట మగ్గమే మాకు ఆధారమైంది. గంటల తరబడి గుంటలో కూర్చొని మగ్గం నేస్తే వెన్నునొప్పి, కాళ్ల నొప్పులు వస్తున్నాయి. ప్రభుత్వం గుంట మగ్గాల స్థానంలో ఫ్రేమ్ మగ్గాలు అందిస్తే ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. కార్మికులకు ఫ్రేమ్ మగ్గాలు అందిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం సంతోషకరం.

– పెద్ది సత్తయ్య, చేనేత కార్మికుడు, భూదాన్ పోచంపల్లి

### సర్కారు సాయం గొప్ప విషయం

రాష్ట్ర ప్రభుత్వం చేనేత మిత్ర పథకాన్ని అమలు చేస్తున్నది. దీని కింద కార్మికులకు రసాయనాలు, నూలుపై 40 శాతం రాయితీ కల్పిస్తున్నది. దీనిపై కొందరికి అవగాహన లేక, సబ్సిడీ పొందే ప్రక్రియ తెలియక రాయితీ పొందలేకపోయారు. దీన్ని పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మగ్గం మీద పనిచేసే ప్రతి కార్మికుడికి నెలకు రూ.3వేలు వారి ఖాతాలో జమ చేస్తున్నది. ఈ నిర్ణయం హర్షించదగ్గ విషయం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకాలు అమలు చేయలేదు. చేనేత కార్మికుల పాలిట సీఎం కేసీఆర్ దేవుడు.



– తడక రమేశ్, చేనేత సంఘం జిల్లా నాయకుడు

### నేతన్నకు చేయూత పథకంతో ఎంతో మేలు

చేనేత కార్మికులను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన నేతన్నకు చేయూత పథకం ఎంతో ఉపయోగకరంగా ఉన్నది. ఈ పథకం వల్ల కార్మికులకు ఆర్థిక స్వావలంబన పెంపొందుతుంది. కార్మికుల ఆదాయాన్ని బట్టి పొదుపు చేసే మొత్తానికి మరో రెండు రెట్లు ప్రభుత్వం కల్పిస్తుంది. ప్రభుత్వం ప్రకటించిన చేనేత బీమా సైతం ఆకస్మిక మరణం పొందిన చేనేత కార్మికుల కుటుంబాలకు బాసటగా నిలుస్తుంది. నేతన్నల సామాజిక భద్రత కల్పించడం కోసం నేత కార్మికుల నెలసరి చేనేత ఆదాయంలో 8 శాతం ఆర్‌డీ 1లో జమ చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌డీ 2లో 15 శాతాన్ని నేరుగా జమ చేస్తుంది. ఆ మొత్తం నగదును వడ్డీతో సహా మూడేండ్ల తర్వాత కార్మికులకు అందిస్తుంది. దీంతో నేతన్నలకు ఎంతో ఆసరాగా ఉంటుంది.



– జెల్ల వైకుంఠం, చేనేత కార్మికుడు, రాంనగర్, భూదాన్ పోచంపల్లి మండలం

### చేయూత పథకంతో చేనేత జీవితాల్లో వెలుగులు

ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న నేతన్నకు చేయూత పథకం చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నది. ఈ పథకం ద్వారా కార్మికుడు వెయ్యి రూపాయలు పొదుపు చేస్తే ప్రభుత్వం మరో వెయ్యి జమ చేసి 2వేల రూపాయలను ప్రోత్సాహకంగా అందజేస్తుంది. దీంతో ఒక్కో చేనేత కుటుంబానికి గరిష్ఠంగా రూ.4వేల ఆర్థికం సహాయం జమ అవుతుంది. సంవత్సరానికి ప్రభుత్వం నుంచి ఇంచుమించు 48వేల రూపాయలు అందుతుంది. ఈ డబ్బుతో కార్మికుల ఆర్థిక స్వావలంబనతో పాటు వృత్తిపై భరోసా పెరుగుతుంది. ఈ పథకం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.



– కొంగరి సత్యనారాయణ, చేనేత కార్మికుడు, సిరిపురం, రామన్నపేట మండలం

### జిల్లాలో 3,500 ఫ్రేమ్ మగ్గాలు ఉన్నాయి

జిల్లాలో 6,651 జియో ట్యాగింగ్ కలిగిన మగ్గాలు ఉన్నాయి. ఇందులో 3,500 వరకు గుంట మగ్గాలు ఉన్నట్లు సర్వే నిర్వహించి గుర్తించాం. అర్హులైన వారందరికీ రూ.37వేల వ్యయంతో ఆధునిక ఫ్రేమ్ మగ్గాలు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– విద్యాసాగర్, చేనేత జౌళి శాఖ జిల్లా ఏడీ

